

"మామా ఊళ్లెకు అన్నలచ్చిన్ను – పంచాతులన్ని తప్పా చేస్తున్నరంట. మన జమీను సంగతి గిట్ట మాట్లాడతవా?" వీధిలోంచి ఇంట్లోకి వస్తూ లచ్చిమి తన భర్త మడావి జంగూ నడిగింది.

ఆదిలాబాదు జిల్లాలో ఆసిఫాబాదు వెళ్లే దారిలో కేరామేరి గ్రామం నుంచి సుమారు పది మైళ్ల దూరంలో వుంది బాబ్జీపేట గ్రామం. ఆ గ్రామంలోని ముప్ఫయి గోందు కుటుంబాల్లో మడావి జంగూ దొకటి.

అప్పుడు సుమారు రాత్రి పది పదకొండు గంటలయుండొచ్చు. బంగళా (అధికారుల కోసం వేసే గుడిసె) దగ్గర ఏదో వాయిద్యం టుపుకు టుపుకున కొట్టిన చప్పుడు విన్పిస్తోంది. అయిదారు గొంతులు

కలిసి గోండు భాషలో పాడే పాటలీలగా వినిపిస్తోంది. భార్య లచ్చిమి అక్కడికే వెళ్ళి వస్తున్నదని మడావి జంగూకు తెలుసు.


"ఏమాయె సప్పుడు జెయ్యవూ — పన్నవా?" అంది లచ్చిమి భర్త పడుకున్న మలక మంచమ్మీద కూమంటూ —

కప్పుకున్న గొంగళి మొహమ్మీద నుంచి జరిపి "అన్నలు బందూకులు పట్టుక తిరుగుతరని ఆల్లెంటబోతే కిరకిరి. ఆల్లకు మాత్రం బయం లేదనుకున్నవా? ఆల్ల బయమాల్లకున్నది — పోలీసోల్లంటె బయం — పొజంటే బయం — గసుంటోల్లతోని ఫైసలా సేపిత్తే అది విలుత్తదా? మనకు తాసీల్దార్ సాబ్ లేడా? ఉట్నూర్ల మన కలక్టరు సాబ్ లేడా? సర్కారు లేదా? గిట్ల గిట్లున్నదని ఆల్లకు సెప్పుకోవాలె — కలెక్టర్ సాబ్ చెప్పిండంటే దొర కాదంటడా?" అన్నాడు జంగూ.

ఆదివాసి హృదయంలా స్వచ్ఛంగా, అమాయకంగా కాస్తోంది వెన్నెల. గుడిసెల్లోకి దూరుతున్న చలివి ఏమీ చేయలేకపోయినా, పోరాటం మాత్రం మానలేదు గుడిసె బయట మండుతున్న నెగడు. లచ్చిమి చలికి వణుకుతూ జంగూ కప్పుకున్న గొంగళి వెచ్చదనంలోకి తనూ వస్తూ "ఏమో అవన్నీ నాకు తెల్వదు — అన్నలైతే భీము జమీను ఇప్పిచ్చిన్రు. మామ్కుకు అచ్చే పైసలిప్పిచ్చిన్రు.

గట్లనే మనది సుద ఇప్పిస్తరేమోనని అడిగిన — బంగళా కాడ గూడేవోల్లంత కుప్పకూడిండ్లు, మవ్వు రాలేదని నేను ఎనక వచ్చిన" అంది లచ్చిమి.

ఆమెను దగ్గరకు తీసుకుని వళ్లంతా నిమురుతూ "ఇప్పిచ్చినుగానీ ఓ కాయిదమా కతుపా — అన్నలు వోయినంక ఆవన్నీ మళ్లీ గుంజుకోరా? గీ సంగతంత పోలీసోల్లకు ఎర్కలేదనుకున్నవా? అన్నలు ఎప్పటికి మనగూడెంల వుండరు గదా? ఆళ్లు అటు పోంగనే పోలీసోల్లు ఇటు దంచుతరు. మనకెందుకీ కిరికిరులన్నీ — మన కేసు అంగడి దివాన ఉట్నూర్ల ఫైసల కత్తది — అప్పుడు సూడు సర్కారంటే ఏందో"




"హ గొడుగు ఎక్కడ మరచిపోయానో జ్ఞాపకం రావడం లేదోయ్ అన్నాడు ఒక పెద్దమనిషి.

అసలు మర్చిపోయినట్లు ఎలా జ్ఞాపకం వచ్చింది? అడిగాడు రెండో పెద్దమనిషి.

ఇందాక బాగా వానకురిసింది కదూ? వాన వెలిశాక గొడుగు ముడిచేద్దామని చెయ్యి ఎత్తితే గొడుగు కనిపించలేదు. అప్పుడు జ్ఞాపకం వచ్చింది అన్నాడు ముసలాయన.

— ఐ.అంజనీదేవి, ఒంగోలు

అన్నాడు జంగూ. బంగళా దగ్గర ఎవరో గొంతెత్తి పాడుతున్నారు. నలుగురో అయిదుగురో శ్రుతి కలిపారు. జంగూకు లోపల ప్రాణం పీకుతూనే వుంది. నెగడు దగ్గర కూమంటే మీటింగుకు పోవల్సి వస్తుందని తన మంచం వదల్లేదు.

పాట ఆగింది.

సర్కారు ద్వారా భూమి రాగలదనే విశ్వాసం జంగూ చెయ్యి ద్వారా శరీరమంతా వ్యాపించిందేమో, లచ్చిమి మరి మాట్లాడలేదు. జంగూ కౌగిలిలో వొదిగి పడుకుంది. బంగళా దగ్గర అన్నలు చేసిన పంచాయతులు, యిచ్చిన తీర్పులు నిర్వహించిన ప్రజాకోర్టు వ్యవహారం వాళ్ళిద్దరూ పట్టించుకోలేదు.

***

"మడావి జంగూ హాజిర్ హై" అని విసుగ్గా మూడోసారి పిలిచాడు ఉట్నూరు ట్రైబల్ వెల్ఫేర్ డిప్టీ కలెక్టర్ జవాను. అప్పటికే ఇరవై కేసుల్లో పార్టీలను ఇలా పిలిచివున్నాడతను. పది కేసుల్లోనైనా పార్టీలు రాలేదు.

"ఈ గోండోల్లింతే. బద్దుమాషి మనుషులు. జమీను పోగొట్టుకుంటరు. ఇప్పిస్తమన్నరారు. పోయిన భూమి అల్లదా — కలెక్టర్ సాబ్‌దా — అర్థమైతలేదు" అనుకుంటూ వెనుదిరిగి పోబోయాడు.

"జంగూ హాజిర్ నహీహై సాబ్" అని చెప్పబోయేంతలో ఇరవై రెండేళ్ళగోండు యువకుడు "సాబ్ నన్ను పిల్చినవా?" అన్నాడు.

"హౌ బే. నీ పేరు మడావి జంగూ వల్లు దత్తూనా" విరాగ్గా అడిగాడు దఫేదారు.

"హౌ సాబ్"

"మరి ఇంతదాన్క ఏం జేస్తున్నవ్? సాబ్ నీ కోసం ఇంతజార్ చేయాల్నారా"

"జర దూరంగున్న సాబ్ — ఇన్పిస్తలేదు" అంటూ జంగూ ఆఫీసులోకి వెళ్ళబోతుండగా ఆపి "అరే సాబ్ దగ్గరకి నంగాసర్‌తోని పోతావురా — పగిడీ కట్టు" అని తలపాగా కట్టించి లోనికి పంపాడు.

జంగూ చేతులు కట్టుకుని భయంభయంగా కోర్టు హాలులో అడుగుపెట్టాడు. కోర్టు హాల్లో డిప్టీ కలెక్టర్, గుమాస్తా, ఇద్దరు వకీళ్లు తప్ప ఇంకెవరూ లేరు. వచ్చిన వకీళ్లు కూడా ఇతర కోర్టుల్లో పనిలేనప్పుడు మాత్రమే ఈ కోర్టుకు వస్తారు. గుమాస్తా జంగూతో ఆనవాయితీగా ప్రమాణం చేయించాడు. ఆ ప్రమాణం అయింతరవాత డిప్టీ కలెక్టరుగారు విచారణ ప్రారంభించారు.

"నీ తరఫున వకీలెవరైనా వున్నారా"

"లేరు దొరా"

"పెట్టుకుంటావా?"

"పైసలేడియి దొరా?"

"అడిగిందానికి సూటిగ జవాబు చెప్పు. పైసలేడియి అంటే మమ్మల్నిమ్మంటవా?" గుమాస్తా గద్దించాడు.


"అయ్యా వున్నమాట చెప్పిన. అదీ నీతోని కాదు. అయ్యతోని మధ్యల నీదేంది" అన్నాడు జంగూ.

"వళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడు — పెడసరంగా మాట్లాడ్డానికి యిది మీ ఇల్లు కాదు — కోర్టు" అని వురిమాడు గుమాస్తా.

గుమాస్తా వైపు కోపంగా మాస్తూ "అతన్ని చెప్పనీయండి" అన్నాడు డిప్టీ కలెక్టరు. ఇలా చనువిస్తే గోండోళ్ళు నెత్తిమీదికెక్కుతారు అనే అభిప్రాయం వున్న గుమాస్తా ఏమీ అనలేకపోయినా జంగూను తినేసేట్టు చూశాడు.

"ఆ ఇప్పుడు చెప్పు జంగూ నీ విషయం."

"అయ్యా మాది ఐదెకరాల జమీను. మా తాత జంగల్ కొట్టి సాఫ్ చేసిండంట. హేమండార్ఫ్ దొర వచ్చినప్పుడు పట్టాలిప్పించిండు. మా సెల్లె లగ్గానికి భూమి దొరకాడ రైనుబెట్టి పైసలు దెచ్చినం. ఇప్పుడు పైసలిచ్చి భూమి యిడిపిచ్చుకుందామంటె దొర భూమి యిస్తలేదు. ఈ భూమి పోతే మేము వ్వారి సచ్చుడే — ముందైతే పోడు గొట్టుకునేటోల్లం — ఇప్పుడా జంగ్లాతోల్లు పోడు కొట్టనిస్తలేరు. మేం



యాడికి బోవాలె సెప్పు''

''నీ పట్టా కాగితం తెచ్చావా?''

''అది దొర గుంజుకున్నడు. దాని నకలు మీ దఫ్తర్‌లోనె వుండాల కాద్దొరా. అది జూడు మరి...''

కోపంగా ఏదో అనబోయి తమాయించుకున్నాడు గుమాస్తా.

''అదలా వుంచి ఈ భూమి నీది అని చూపే ఇతర సాక్ష్యాలేమైనా వున్నాయా?''

వేస్తెస్తున్నా కాద్దొరా? గోండోళ్లే జూట చెప్తరా?''

''ఇంకేమైనా చెబుతావా?''

''ఇంకేముంది? ఈడనే బుట్టి ఈడనే సచ్చేటోళ్లం మేము. యాణ్ణుంచో యాడికచ్చి మా బూములు కబ్జా చేసుకుని మమ్మల్ని తరిమేటోడు మాధవరావు దొర.

భూమి యిప్పిస్తవా సరే — లేకపోతే జంగల్ పట్టుడే''

తన బయాను ముగించాడు జంగూ —

డిప్టీ కలెక్టర్ జంగూ సాక్ష్యం రాసుకుని సంతకం చెయ్యడానికి జంగూకిచ్చే ముందు ''మీరు క్రాస్ చేస్తారా'' అని అడిగాడు మాధవరావు వకీలు రంగారావుని.

''ఎస్, యువరానర్ — క్రాస్ ఎగ్జామినేషన్, ఆర్గ్యుమెంట్ కూడా, ఈరోజే పూర్తి చేస్తాను'' అంటూ మొదట ప్రశ్న వేశాడు రంగారావు.

''ఏమయ్యా దొర దగ్గర రైను పెట్టినవ్వావు కదా — ఆ రైను తాలూకు కాగితాలేమైనా వున్నయా?''

''లేవు దొరా — మాట మీద పెట్టినం. దొరతోని కాయితాలు రాయించుకునేటంతోళ్లమా మేము?''

''మరి నువ్వు తాకట్టు పెట్టినట్టు ఏమిటి సాక్ష్యం?''

''నేను చెబుతున్నాను కదా దొరా — రాజగోండు అబద్ధం సెప్పడు''

''అంటే నీ నోటి మాట తప్ప ఇతర సాక్ష్యమేదీ లేదా?''

''ఆ భూమే సాక్షి.'' ఆ భూమి ఎవల్లదో వూళ్లో అడుగు.

''యిపుడెవలు కాస్తు చేసుకుంటండ్లో నీ కండ్లతో సూడు. నీకే తెలుస్తుంది.''

''దొరగారేమో ఆ భూమి ఎవరూ తాకట్టు పెట్టలేదనీ, మొదట్నుంచీ తనదేననీ అంటున్నారు. ఆయన అబద్ధమాడుతున్నాడంటావా?''

జంగూ నమ్మలేకపోయాడు. తేరుకుని ''దొర భూమి యిస్తాడనుకున్నా గానీ తనదే అంటున్నడా? మరి కసమ్ తిని చెప్పమను''

''దొర ప్రమాణం చేయాలారా నీ ముందు. అంత గొప్పదా నీ మాట'' రంగారావు హుంకరించాడు.

''అవున్దొరా — దొరకైతే భూముంది — పైసలున్నయ్ — మీరున్నారు. నాకేముంది మాట తప్ప.''

''అతిగా మాట్లాడకు. చెల్లె పెల్లికి తనఖా పెట్టానన్నావు కదా — అంత డబ్బు ఎందుకు అవసరమైంది?''

''కట్నానికి దొరా''

''కట్నానికా?''

''ఔ దొరా''

''మరి ఇప్పుడు భూమి విడిపించుకోవడానికి డబ్బెక్కడిది?''

''నాకు అగ్గమైంది కాద్దొరా? కట్నమిచ్చినము — ఆ పైసలు పెట్టి ఇడిపిచ్చుకుందామని''

లాయర్ రంగారావు చేతులూపుతూ ''మాశారా యువరానర్, ఇతగాడు ఎంత నిర్భయంగా చట్ట విరుద్ధమైనపని చేస్తున్నాడో? కట్నమిచ్చాడు, పుచ్చుకున్నాడు, కట్నాలివ్వడం, పుచ్చుకోవడం నేరం కాబట్టి ఇతణ్ని ప్రాసిక్యూట్ చేయ్యాలి. ఇలాంటి పెద్ద విషయాన్ని వదలి మనం అప్రధానమైన భూమి కేసు విచారిస్తున్నాం.

## ఎలా తెలుస్తుంది?

ఆఫీసులో కొంతమంది ఆలస్యంగా వస్తున్నారని రిపోర్ట్ వచ్చింది. రేపటినుంచి ఎవరు ఆలస్యంగా వస్తున్నారో నాకు చెప్పండి అన్నాడు ఆఫీసర్ గుమస్తా గుర్నాథంతో

'నాకెలాతెలుస్తుంది సార్! నేనువచ్చేసరికి అందరూ వచ్చివుంటారుగా 'చెప్పాడు గుర్నాథం

పి.రాము,గుంటూరు

పోనీ భూమి విషయం చూద్దామా అంటే అదెట్లా తగలడింది? పోగొట్టుకున్నానని చెబుతున్న భూమి తనదేనని నిరూపించే సాక్ష్యాధారాలేమీ లేవు. తనఖా పెట్టినట్టు నిరూపించే కాగితాలుగానీ మౌఖిక సాక్ష్యాలు కూడా లేవు. ఇతన్నికున్నదల్లా తన మాట మీద నమ్మకం మాత్రమే.


మరి ఇతడి మాట అంత విలువైనదైతే, కోస్తా ప్రాంతాల నుంచి ఇక్కడికొచ్చి సెటిలయి ఇక్కడి మూర్ఖ ప్రజలకు సేవ చేస్తున్న మాధవరావుగారి లాంటి పెద్దమనిషి మాటకు విలువ ఎంతుండాలి? ఇలాంటి కోన్‌కిస్కా గాళ్ల భూమి తీసుకుని ఆయన తీసుకోలేదని అబద్ధమాడతాడా? అలాంటి అవసరం మాధవరావుగారికుందా? అసలు సాక్ష్యాధారాలేమీ లేని కేసు ఇంత లోతుగా పరిశీలించాల్సిన అవసరం కూడా లేదు. కేసు కొట్టివేయవల్సిందిగా కోర్టు వారిని సవినయంగా ప్రార్థిస్తున్నాను'' అని రంగారావు కూచున్నాడు.


జంగూకు రంగారావు మాటలు తికమకగా వున్నాయి.

డిప్టీ కలెక్టర్ రంగారావుకేసి చూసి ''రంగారావు గారూ, మీరెంతసేపూ జంగూ కేసులోని బలహీనతలెత్తి చూపుతున్నారు — అది సరిపోదు. ఏజెన్సీ ప్రాంతాలలో ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ ప్రకారం ఏ ఆదివాసైనా తన భూమిని గిరిజనేతరులు ఆక్రమించుకున్నారని, తన భూమి చట్టవిరుద్ధంగా బదిలీ అయ్యిందని ఫిర్యాదుచేస్తే అలా ఆక్రమించలేదని నిరూపించాల్సిన బాధ్యత గిరిజనేతరులపై వుంది. ఈ విషయం మీకు తెలియంది కాదు.

అందుచేత ఈ కోర్టుకు సంబంధించినంతవరకూ జంగూ మాటచాలు. ఇతర సాక్ష్యాలేమీ అవసరం లేదు. ఆ భూమి మాధవరావుగారి స్వాధీనంలో లేదని నిరూపించగలరా?'' అన్నాడు.

''ఇలాంటి విషయాల్లో సాక్ష్యాలేముంటాయి యువరానర్? ఈ ప్రాంతానికంతా పెద్ద భూస్వామి మాధవరావుగారి మాటకు విలువలేందంటే వేరం






చెప్పను. అయినా నిష్పక్షపాతంగా వ్యవహరించవల్సిన కోర్టే ఒక పార్టీ తరఫున వకాల్తా పుచ్చుకుంటే న్యాయమేమి జరుగుతుంది? సరే తీర్పు కోసం ఎప్పుడు రమ్మంటారు?'' రంగారావు నిర్లక్ష్యంగా అన్నాడు. ఇక్కడ కేసు ఓడిపోయినా అప్పీలువేసి గెలువొచ్చునె మ్మన్న ధీమా కన్పిస్తోంది ఆయన మొహంలో. కోపాన్ని దిగమింగుకుంటూ డిప్టీ కలెక్టర్ ''తీర్పు కోసం ఇంకో రోజెందుకు? రెగ్యులేషన్ 1 ఆఫ్ 1970లో ఏజెన్సీ ప్రాంతంలోని భూమంతా గిరిజనులకే చెందుతుంది అనే ప్రిజంప్షన్ వుంది. న్యాయసమ్మతంగా గిరిజనేతరులు ఆ భూమి పొంది వుంటే ఆ విషయం నిరూపించవల్సిన బాధ్యత వారిదే —

ఈ కేసులో అలాంటి బాధ్యత మాధవరావుగారిపై వుంది. ఆయన న్యాయసమ్మతంగా జంగూ భూమి పొందినట్లుగా మీరు నిరూపించలేకపోయారు. అందుచేత బాబ్జీపేట సర్వేనెంబరు 94 నుండి మాధవరావుగారిని తొలగిస్తూ ఆ భూమి తిరిగి జంగూకు చెందే విధంగా తీర్పు ఇస్తున్నాను. ఈ తీర్పు కాపీలు కాసేపాగి తీసుకోవచ్చు'' అని లేచి తన ఛాంబర్‌లోకి వెళ్ళిపోయాడు.

**

జంగూ తీర్పు కాపీ తీసుకుని కళ్ళకద్దుకుని ఎగిరి గంతులేస్తున్నాడు. అంగడికోసం వచ్చిన జంగూ మిత్రుడు మాన్కుకు జంగూ విజయం విషయం తెలిసి మరికొందరు గోండు యువకులను పోగుచేసి పాటలు పాడ్డం మొదలు పెట్టాడు. జంగూ విజయం గిరిజనులందరిదీ అన్నట్టుగా వారు జంగూతో కదం కలిపారు.

కోర్టు కాయితాలు తీసుకుని బయటకొచ్చిన రంగారావుకు వీళ్ల ఆనందం కంటగింపుగా వుంది. తుపుక్కున వుమ్మి ''అప్పుడే ఏమైందిరా ముందున్నది ముసళ్ళ పండగ — రండ్రా భూమ్మీదికి చూద్దాం'' అంటూ తన మంది మార్బలంతో జీపులో ఎక్కి వెళ్ళిపోయాడు.

జంగూ ఉట్నూరు నుండి బాబ్జీపేటకు చేరుకునేదాకా కోర్టులో జరిగిన విశేషాలన్నీ పూసగుచ్చినట్టు అందరికీ చెబుతూనే ఉన్నాడు. డిప్టీకలెక్టర్‌గారిని తనకొచ్చిన వుపమానాలతో అతిశయంగా పొగుడుతూనే వున్నాడు. మాన్కుకు మాత్రం రంగారావు పోతూపోతూ అన్నమాట భయం కలిగిస్తోంది. ''సర్కారు కాయితం అయితే ఇచ్చింది. కానీ మళ్ల జమీను కాడ తకరారు అయితదేమొ. కాయితమిచ్చిన సర్కారు గాయింత దున్నుకునే కాడికి వచ్చి నిలబడితే మంచిగుండు'' అనుకున్నడు, అప్రియమైన విషయాల గురించి మాట్లాడ్డమెందుకనుకున్నాడో ఏమో, సద్దులేకుండా వూరివైపు నడక సాగించారు. వాళ్లు బాబ్జీపేట చేరుకునేసరికి రాత్రయింది. భార్య లచ్చిమి చేసిన జొన్నరొట్టెలు తిని చలిగా వున్నా ఆరుబయట వెగటికాడ పడుకున్నారు. వెగడు చిటపటలాడుతుంది. గూడెమంతా వచ్చి జంగూను అభినందించి కేసు వివరాలు విని వెళ్లిపోయారు.

రాత్రి గడుస్తోంది. లచ్చిమి భర్త పక్కలోకి చేరుకుంది. వెగడు చిటపటలాడుతోంది. చుట్టూ వనఓషధుల పరిమళాన్ని నింపుకున్న చల్లటిగాలి ఉండీ ఉండీ వినబడుతున్న జంతువుల అరుపులు తప్ప మరే శబ్దమూ లేదు.

జంగూకు నిద్రరావడం లేదు. ఆకాశంలో వెలపొడిచి బారెడే ఎక్కింది.

''ఈడ ఏముందని బయటోళ్లు వస్తరు — మమ్ముల పరేషాన్ జేస్తరు'' అనుకున్నాడు జంగూ. ఏ క్రూరమృగానికీ ఎప్పుడూ జడవని వాడు ఇప్పుడు బయటోళ్లకు జడవ్వల్సి వస్తోంది.

లచ్చిమిని తన కౌగిట్లోకి తీసుకుంటూ ''నే జెప్పలేదా — అన్నలు అన్నలంటవ్ — ఊళ్లోందరికీ సర్కారు సంగతి ఇంకా ఎర్కలే'' అన్నాడు.

''అది గాదు మామా — అల్ల పాటలు...'' అంటూ ఏదో చెప్పబోయింది లచ్చిమి.

లచ్చిమిని మాట్లాడనీయకుండా అదిమి పట్టుకుని ''పాటలేందే — మన సాబ్ ఇన్సాఫ్ చేయలే — మనకేమన్న పైసలు కర్సయినయా? సాబ్ అల్ల వకీల్‌ను గెట్ల తిట్టిండో ఎరికేనా?'' అన్నాడు. విసుగు లేకుండా వినేసరికి విసుగు కలుగుతుందన్న బాధ లేకుండా కోర్టు విషయాలు మళ్లామళ్లా చెప్పాడు. లచ్చిమి కూడా భర్త మాటలు ఓపిగ్గా వుంది. వింటూనే నిద్రలోకి జారిపోయింది. జంగూకైతే కలలే కలలు. దుక్కి దున్నినట్టు రబీజొన్న పోత పోసినట్టు, పెరిగిన పైరు గాలికి వూగుతున్నట్టు తను మంచెలోంచి పిట్టలను కొడుకుతున్నట్టు తన దారిద్ర్యం తీరిపోయినట్లు అపరంజి కలలు.

ఆ వూళ్లో ఖరీఫ్ పంటలే ఎక్కువ పండిస్తారు. అలోగని రబీ వెయ్యరని కాదు. చాలా తక్కువ. ఈ పాటికే వూళ్ల సగం జొన్నదుక్కులైపోయాయి. జంగూ కూడా ఆ భూమి తకరారులో లేకుంటే దుక్కి దున్ని పెట్టేవాడే — దివడి మాసం (అక్టోబరు) పోయేలోపు జొన్నపోతలు కావాలి. దండారి కాలానికి (దసరా — దీపావళి మధ్యకాలం) పోతలైపోవాలి.

ఉదయాన్నే జంగూ, లచ్చిమి, జంగూ తమ్ముడు సోమూ జడ్జిమెంటు కాయితం తీసుకుని బాబ్జీపేట కేరామేరి గ్రామాల మధ్యన వున్న తమ భూమిపైకి వెళ్లారు. వారివెంట రెండు నాగళ్లూ రెండు ఎడ్ల జతలూ తప్ప మరే ఇతర ఆర్బాటాలూ లేవు. పిలిస్తే మాన్కూ వాళ్ల వెంట వచ్చేవాడే కానీ, అన్నల అంటూ సొంటూ వుండకూడదని మాన్కును పిలవలేదు. మాన్కూ అన్నల మనిషని జంగూ నమ్మకం.

వారు భూమి దగ్గరకు చేరుకునే సరికి అక్కడ అప్పటికే కోలాహలంగా వుంది. ఏడు నాగళ్ళు చేను దున్నుతున్నాయి. పది పదిహేనుమంది మనుషులు తిరుగుతున్నారు హడావిడిగా. పడమటివైపున వున్న ఇప్పచెట్టు కింద మాధవరావు నిలబడి అందరికీ పురమాయిస్తున్నాడు.

జంగూను చూడగానే మాధవరావు పెద్దగా నవ్వి ''ఒరేయ్ —రాజగోండు గారొచ్చారు. ప్రభువుల వారికి ఏం కావాలో తెలుసుకోండి'' అన్నాడు.

జంగూ ఈ హేళనను పట్టించుకోకుండా వినయంగా వంగి ''రావ్ఁ రావ్ఁ దొరా — నమ్మ రాజంటావేంది? నీ కాళ్ల కాడ బతికేటోళ్లం'' అన్నాడు.

''అలాగేం — మరయితే మేం ఎక్కణ్ణుంచో వచ్చి మీ భూములు ఆక్రమించుకున్నామని కోర్టులో కూశావట''

''అవుందొరా — మరి నా భూమి నాకియుండని ముంగల విన్నడిగి, నువు కాదంటే అదాలతుకు బోయిన. దొర ఫైసలా జేసిండు. ఇగో కాయిదం — కాయిదంల తప్పు రాసిండేమో నువ్వే జూడు. నా భూమి నాకిచ్చెయ్. మనిద్దరికీ పంచాతుండదు'' అని జంగూ కాయిదం మాధవరావుకిచ్చాడు.

మాధవరావు కాయితం తీసుకుని చూడకుండానే ''జడ్జిమెంటు అప్పుడే తీసుకున్నావన్నమాట — గొప్పవాడివే'' అంటూ పరపరా చింపి పారేశాడు.

''దొరా ఎంత పనిజేసినవ్'' జంగూ ఏడుస్తూ కాయితం ముక్కలు ఏరుకోబోయాడు.

''మీ దొరనడుగు ఇంకోటిస్తాడు —

అని కాయితాలేరుకుంటున్న జంగూను తన్నాడు మాధవరావు.

తన ధర్మ పోరాటానికి, ఆ పోరాటంలో విజయానికి గుర్తుగా ఇచ్చిన కాయితాన్ని చింపివేయడం అసభ్యంగా తన భార్య ప్రసక్తి తీసుకురావడంతో జంగూ మాధవరావు మీదికి లంఘించాడు. దబదబమని మాధవరావు రొమ్ముని గుద్దాడు. ఇది చూసి మాధవరావు పాలేర్లందరూ మాధవరావును విడిపించి కర్రలతో జంగూమీద పడ్డారు. కర్రలు పటేల్మన్నాయి. జంగూ శరీరం తూట్లు పడుతోంది. అడ్డంబోయిన లచ్చిమి, సోము మట్టి పెళ్ళల్లో పడ్డారు. జంగూ నాగేటి వాళ్లలో పడి విలవిలా కొట్టుకుంటున్నాడు. కాళ్ళు చేతులు తన శరీరానికి చెందక విడివిడి ప్రాణులైనట్టు కొట్టుకుంటున్నాయి.

భూమి నెత్తురు త్యాగం కోరిందా అన్నట్టు కారిన నెత్తురునంతా తనలో ఇముడ్చుకుంది. ఎడ్లు ఈ గలాటా చూసి కాడి మీదనే రంకెలేస్తున్నాయి. లచ్చిమి లేచి భర్తదగ్గరకొచ్చి కొడుతున్న వారికి దణ్ణం పెట్టి ''అన్నలారా — మీరు గోండోళ్లు కారా. మా అసొంటి గరీబోల్లు కారా! దొర మాట మీద మీ కులపోన్ని సంపుతరా'' అని ఏడుస్తూ చలనం లేని జంగూ శరీరాన్ని కావలించుకుంది. సోము కష్టమ్మీద లేచి వూరి వాళ్ళను తీసుకొద్దామని బాబ్జీపేటకు పరుగెత్తాడు.

జంగూ మురికిచేతులు తగిలి మరకైన తెల్లని లాల్చీ దులుపుకుని మాధవరావు ''ఈ బాడ్ఖావు ముండాకొడుకు చస్తే మళ్లీ కేసులూ — గొడవాను. ఇవ్వాల్టికి దున్నడం ఆపి ఇళ్ళకు పొండి'' అని తన పరివారంతో ఇంటికెళ్లిపోయాడు. ఆయన వెంట ఆయన ఉప్పుతిన్న గిరిజనులు కూడా వెళ్లిపోయారు. స్మశానం లాంటి భూమిలో జంగూ, లచ్చిమి మాత్రమే మిగిలారు.

మూలుగుతున్న జంగూ వళ్లంతా తడుముతూ, నెత్తురు తుడుస్తూ, తన కన్నీళ్ళతో గాయాల్ని కడుగుతూ తన అసహాయతను తిట్టుకుంటూ కూచుంది లచ్చిమి.

సోమూ దుక్కలమీద పోయిన వూరి వాళ్లను పోగుచేసి తీసుకొచ్చే సరికి మధ్యాహ్నమైంది. అంతవరకూ ఆ ఎండలో అలా కూచునే వుంది లచ్చిమి భర్త శరీరం ప్రక్కనే.

మాధవరావు అక్కడే వుంటే పరిస్థితి ఎలా వుండేదో కానీ, లేనికారణంగా మరేమీ చేయలేకపోయారు వూరి నుంచి వచ్చిన గోండు యువకులు. మాధవరావును బూతులు తిడుతూ ''అణ్ణని ఏం ఫాయిదా — రఃడు మన మాటయింటడా. ఊరంతా ఒక దిక్కయితే రఃడొకటీ ఒక దిక్కు కదా. సర్కారు ఇప్పిస్తదంటడు — గట్ల ఇప్పిస్తే ఈ తకిలీబెందుకు'' అన్నారు.

ఒక ప్రధాను జాతి ముసలాయన జంగూ గాయాలకు ఆకుపసరు రాసి కట్లు కట్టాడు.

లచ్చిమికి, సోముకు కూడా పసరు రాశాడు.

స్పృహలేని జంగూను మోస్తూ నెమ్మదిగా వూళ్లోకి తీసుకొచ్చారు.

''జంగూను దవాఖానాకు తీస్కపోవాలె'' అని కొందరంటే—

''ఆ అక్కడ కండ్లు కానరు. అన్నల కాడ సూదులంటయి. ఆళ్ళొచ్చినంక సూదులేత్తరని'' మరికొందరన్నారు. చాలాసేపు చర్చించిన తరవాత అన్నలకు చెప్పడమే మంచిదనిపించింది వారికి.

అన్నల అన్వేషణలో మాన్యా వెళ్లాడు.

***

రాత్రయింది. నెగడు చిటపటలాడుతోంది. మలకమంచంలో జంగూను పడుకోబెట్టి మంచం ప్రక్కనే లచ్చిమి, లచ్చిమి తండ్రి, సోము కూచున్నారు. ఊళ్లో వాళ్లు ఏం చెయ్యాలో తోచక వచ్చి సానుభూతి మాటలు చెప్పి వెళుతున్నారు.

''కలెక్టరు దొర ఇచ్చిన కాయిదం దొర చింపేసిండు. మన జమీను మనకు దక్కదా. తూరుబ్బాజు పిట్ట రాలుతున్నాయ్'' అంటూ కలవరిస్తున్నాడు జంగూ.

ఇంతలో బంగళానానుకుని వున్న గుట్టవైపు కలకలం వినిపించింది. అడుగుల చప్పుడు, మాటలు విన్పిస్తున్నాయి.

జంగూ స్పృహలోకి వచ్చి ''ఏందో అలికిడయింది — సూడు'' అన్నాడు లచ్చిమితో బలహీనంగా.

లచ్చిమి బయటకెళ్ళి వెన్నెల వెలుగులో ఆకుపచ్చ బట్టలేసుకుని, చేతిలో తుపాకులు పట్టుకుని వస్తున్న యువకులను చూసి పరుగుపరుగున జంగూ దగ్గరకొచ్చి ''మామా — అన్నలొచ్చిన్రు. ఆల్లకు మన జమీను సంగతి గిట్ల చెప్పమంటవా'' అని అడిగింది.

''ఆల్లొచ్చిండ్లా'' అంటూ లేవబోయి లేవలేక పడిపోయాడు జంగూ — అప్పటికే నెగడు చుట్టూ మనుషులు చేరిపోయారు. మాన్యా వాళ్ళకేదో చెబుతున్నాడు.

'అన్నల్లో ఒకాయన జంగూ మీద గొంగడి తీసి, ఆప్యాయంగా వళ్లు నిమురుతూ దెబ్బలు చూశాడు. చేతి సంచీలోంచి బ్యాండేజి తీసి స్పిరిట్‌తో గాయాలు తుడిచి కట్టుకట్టాడు. ఇంజక్షన్ చేశాడు.

అతని చేయి పట్టుకుని జంగూ ''దాదలేరే, నా జమీను దొర...'' అంటూ చెప్పడానికి ప్రయత్నం చేస్తున్నాడు.

జంగూ చేయిలో తన చేయి వేసి ''జంగూ దాదా, నీ భూమి ఎటూపోదు — ధైర్యంగా వుండు'' అంటున్న ఆ యువకుడ్ని కొనప్రాణాలతో వున్న జంగూ కావలించుకున్నాడు.

అక్కడ కూర్చున్న వారి అంతరంగాల్లాగే నెగడు చీకటి గుండెను కాలుస్తూ మండుతోంది.

(అబంపి పబ్లికేషన్స్ గోదావరిఖని వారికి కృతజ్ఞతలతో)

